క్లుప్తంగా

బీసీలకు న్యాయం చేసేందుకు కృషి

చేవెళ్ల: బీసీలకు న్యాయం చేయాలనే పట్టుదలతోనే కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలకు వెళ్లిందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు అన్నారు. చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు అంగీకరించి, ఇప్పుడు ఎన్నికలు జరగకుండా ప్రతిపక్ష పార్టీల నాయకులే తెరవెనక ఉంటూ కోర్టుకు వెళ్లి డ్రామాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలంటూనే మరో వైపు కోర్టులకు వెళ్లటం వెనక వీరికి బీసీలపై ఉన్న ప్రేమ ఏమిటో అర్థం అవుతోందన్నారు. కాంగ్రెస్ తప్పకుండా ఇచ్చిన మాట ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందని నమ్మకం ఉందన్నారు. ఎన్ని అడంకులు వచ్చినా ఎదుర్కొనేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నద్ధంగానే ఉందని తెలిపారు. బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీలంతా ఏకమైన వ్యతిరేకులపై తిరుబాటు చేస్తామని హెచ్చరించారు.

ప్రహ్లాద్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మున్సిపల్ కార్యాలయ సిబ్బంది

పరిగి: తెలంగాణ మున్సిపల్ సెంట్రల్ ఫోరం వ్యవస్థాపకుడు విశ్రాంత మున్సిపల్ అధికారి ప్రహ్లాద్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పరిగి మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మున్సిపల్ ఫోరం ఏర్పాటు చేసి సిబ్బంది, అధికారుల సమస్యలపై ఆయన ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి మున్సిపల్ సెంట్రల్‌ఫోరానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన

పదెకరాలు కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి



స్థల పరిశీలన చేస్తున్న రాష్ట్ర గిడ్డంగుల శాఖ అధికారులు

దుద్యాల్: మండల కేంద్రానికి సమీపంలో ధాన్యం నిల్వ కేంద్రం ఏర్పాటునకు ప్రభుత్వం సన్నహాలు చేస్తుంది. దీనికోసం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రీజినల్ మేనేజర్ వేణుగోపాల్, మేనేజర్ విజయ్ కుమార్ తహసీల్దార్ కిషన్‌తో కలిసి పరిశీలించారు. దుద్యాల్ నుంచి లగచర్ల గ్రామానికి వెళ్తున్న మార్గంలో కృష్ణగిరి ప్రాంతంలోని సర్వే నంబర్ 191లో పదెకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ స్థలానికి సంబంధించిన హద్దులను గుర్తించి గిడ్డంగుల సంస్థకు అప్పగించాలని తహసీల్దార్ కిషన్‌కు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్ కుమార్, గిడ్డంగుల సంస్థ జిల్లా కార్యాలయ సిబ్బంది మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదువుకోవాలి

ఎస్‌ఐ రాథోడ్ వినోద్



గిరిజన బాలికల వసతి గృహంలో మాట్లాడుతున్న రాథోడ్ వినోద్

తాండూరు రూరల్: బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కరన్ కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ పేర్కొన్నారు. గురువారం తాండూరు మండలం జినుగుర్తి గ్రామ సమీపంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎందరో ప్రభుత్వ ఉద్యోగం సాధించి, ఉన్నతస్థాయిలో రాణించారని గుర్తు చేశారు. కష్టపడి చదువుకుంటే గుర్తింపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ యువకుడి కుటుంబం శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జ్యోతి పరమేశ్వరి తెలిపారు. గ్రామానికి చెందిన సంగెం అంజి ప్రథమ వర్ధంతి సందర్భంగా 120 మంది విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్‌లు, ప్లేట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు



బంట్వారం రోడ్డు పరిస్థితి



రొంపల్లి రోడ్డుపై గుంత

కిలోమీటర్ల మేర పాడైన రహదారులు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

బంట్వారం: చాలా కాలంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వాన స్థితిలోనే ఉన్నాయి. వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంకా ఎక్కువగా రహదారులు దెబ్బతిన్నాయి. పలుచోట్ల గుంతలుగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. కల్వర్టులు, వంతెనలు కుంగిపోయాయి. బంట్వారం, కోట్‌పల్లి మండలాల పరిధిలో సుమారు వందల కిలో మీటర్లలో ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. వర్షాలకు గుంతలుగా మారి, పగుళ్లు ఏర్పడడమే కాకుండా, చీలికలయ్యాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా రోడ్లు బాగలేకపోవడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులను సైతం రద్దు చేశారు. రెండు వారాలు కావస్తున్న అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించి బస్సు సర్వీసులను కొనసాగించడానికి ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో బస్సులకోసం ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నత్తనడకన పనులు

మోత్కుపల్లి నుంచి అంతగిరిపల్లి వరకు సీఆర్ఎఫ్ నిధులు రూ.30 కోట్లు మంజూరైనప్పటికీ అవి నత్తనడకన సాగుతున్నాయి. రాళ్లచిట్టెంపల్లి సమీపంలో రెండు చోట్ల రోడ్డుపై బురద చేరింది. బైకులు, ఆటోలు మినహా బస్సులు నడవడం లేదు.

నూరుల్లాపూర్ వాగు దగ్గర..

నూరుల్లాపూర్ వాగు దగ్గర తెగిపోయిన రోడ్డుకు అధికారులు ఇప్పుడిప్పుడే మరమ్మతులు చేయిస్తున్నారు. జేసీబీతో గుంతలు పూడ్చివేయిస్తున్నారు. కానీ వాహనదారులు, స్థానికులు మాత్రం పూర్తిస్థాయిలో రహదారులను మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కుంగిన కోట్‌పల్లి బ్రిడ్జి

కోట్‌పల్లి వాగు బ్రిడ్జి కుంగి ప్రమాదకరంగా తయారైంది. తాండూరు రోడ్డులోని హీరాపూర్ వాగు కల్వర్టు వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఎన్కెపల్లి, రొంపల్లి, నూరుల్లాపూర్ కల్వర్టులు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. రాత్రి వేళ వాహనదారులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలి. రద్దైన బస్సులను యథావిధిగా నడిపించాలి. కుంగిన కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టించాలి. లేనిచో పెద్ద ఎత్తున ధర్నా చేస్తాం.

– నర్సింలు రొంపల్లి

ప్రతిపాదనలు పంపాం

కొత్తగడి–తొర్మామిడి రోడ్డు 30 కిలో మీటర్లు రీకన్‌స్ట్రక్షన్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పనులు చేపట్టే హెచ్‌ఎఎం (హ్యామ్) అనే సంస ప్రదినిధులే చూసుకుంటున్నారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను గుర్తించాం. ప్రస్తుతం బస్సులు తిప్పడానికి గుంతలను పూడ్చివేయిస్తున్నాం.

– సమియొద్దీన్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ప్రోత్సహించడం అభినందనీయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

- టాలెంట్ టెస్టులో ప్రతిఒక్కరూ పాల్గొనాలి
- మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: నైపుణ్యాలను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టులు నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలో సాఫ్ట్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షకు సంబంధించి కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం సాఫ్ట్‌లైన్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు టెస్టులు నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ప్రతిభ కనబర్చిన మొదటి ముగ్గురికి బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని పల్లవి డిగ్రీ కళాశాలలో నవంబర్ 30న పరీక్ష నిర్వహిస్తారని ఆసక్తి గల విద్యార్థులు తమ పాఠశాలల్లోనే పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, హన్మంత్‌రెడ్డి, రవికుమార్, రాములు, సాఫ్ట్‌లైన్ కంప్యూటర్ నిర్వాహకులు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులతో నామినేషన్లకు బ్రేక్



బొంరాస్‌పేట: రిటర్నింగ్ అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్



బంట్వారం: నామినేషన్‌ను స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి వసంత లక్ష్మి

అనంతగిరి: వికారాబాద్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. వికారాబాద్ మండలంలోని 7ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానానికి నామినేషన్ ప్రక్రియ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు. ఎంపీటీసీ స్థానానికి 3 కౌంటర్లు, జెడ్పీటీసీకి ఒకటి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ సుదీర్ పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కాగా మొదటి రోజు ఆశావహులు, వారికి సంబంధించిన నామినేషన్ సెంటర్‌కు వచ్చి పలు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నామినేషన్ పత్రాల ఫారాన్ని తీసుకెళ్లారు. కాగా మధ్యాహ్నం వరకు జోరు మీదున్న ఆశావహులు సాయంత్రం హైకోర్టు స్టే ఇవ్వడంతో ఒక్కసారిగా నిరాశ చెందారు.

ధారూరు: జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ పత్రాలను స్వీకరించడానికి రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఈ నెల 1న నియమించారు. ఈ సందర్భంగా గురువారం వారు విధుల్లో చేరారు. ఇరిగేషన్‌శాఖలో ఈఈగా పనిచేస్తున్న ఏ భాస్కర్‌గౌడ్‌ను ఆర్‌ఓగా నియమించినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ఒకటి స్వీకరణ

బంట్వారం: కోట్‌పల్లి మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలకు గానూ ఒకటి కూడా రాలేదు. బంట్వారానికి పిల్లికండ్ల నర్సింలు నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల సహాయ అధికారులు రాములు, డానియల్, రిటర్నింగ్ అధికారులు వసంత లక్ష్మి, వాల్యానాయక్, ఎంపీఓ నాగరాజు తదితర సిబ్బంది ఉన్నారు.

బొంరాస్‌పేట: మండలంలో మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి రాంరెడ్డి, ఇతర అధికారులు హరిలాల్, రవీందర్‌గౌడ్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ రాఘవేందర్‌లకు ఆయా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి సబ్ కలెక్టర్ పలు సూచనలు చేశారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



వర్ధంతిలో బీఎస్పీ నాయకులు

తాండూరు టౌన్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం దక్కాలనే ఉద్దేశ్యంతో పార్టీని స్థాపించి, బడుగు బలహీన వర్గాల ప్రజలు వార్డు సభ్యుల నుంచి మంత్రులుగా కొనసాగాలని ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు నరేందర్ ముదిరాజ్, జగన్, ప్రవీణ్, అంజద్, నవీన్ యాదవ్, కృష్ణయ్య గౌడ్, చాకలి రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: అంటరానితనానికి (అణచివేతకు) వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి కాన్షీరామ్ అని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్నాపూరం శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో దళిత, బహుజన ఉద్యమాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. సురేందర్, రాజేశ్, నరేందర్, వెంకట య్య, ముకుందనాగేశ్వర్, రాజేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్థవంతంగా బోధన చేయాలి



గణిత ఉపాధ్యాయుల ఏఐ శిక్షణలో ఎంఈఓ గోపాల్

పరిగి: అర్థవంతంగా, సులభ పద్ధతిలో విద్యార్థులకు బోధన చేయాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. పరిగి నియోజకవర్గంలోని ఆయ పాఠశాలల ఉపాధ్యాయులకు పట్టణ కేంద్రంలో మూడు రోజుల డిజిటల్ లెర్నింగ్ (ఏఐ) కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఐ బోధనతో విద్యార్థులకు త్వరగా అర్థమవుతుందని, పాఠాలను ఆసక్తిగా వింటారని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు బసప్ప, రాందాస్, దోమ, పూడూర్, కుల్కచర్ల, చౌడాపూర్ ఉన్నతపాఠశాలల గణిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిని ఎంచుకుని స్థిరపడాలి

పూడూరు: మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకుని జీవితంలో స్థిరపడాలని సైబేజ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అనపురపు సురేశ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగాయపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ మేరకు మహిళల ఉపాధి కోసం కుట్టుమిషన్లు పంపిణీ చేసి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ తమకు మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవితావెంకటదాసు, నాయకులు సీతారాం రెడ్డి, కంపెనీ ప్రతినిధులు, లాస్య, మానస, మహిళలు మంజుల, కావ్య, మాధవి, మహేశ్వరి, ధనలక్ష్మి, నమిత, స్వరూప, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి పరామర్శ



పరామర్శిస్తున్న పైలెట్ రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: గాజీపూర్ గ్రామానికి చెందిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డిని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పరామర్శించారు. రెండు రోజుల క్రితం నారాయణరెడ్డి సతీమణి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రోహిత్‌రెడ్డి గురువారం నారాయణరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచు వీరప్ప, రుక్మాపూర్ రమేశ్, గాజుల గౌస్, మహిపాల్‌రెడ్డి, శ్రావణ్ కుమార్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అంజియాదవ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కాంక్రీటుతో పూడ్చి వేయించండి

అక్కంపల్లి పాఠశాలను సందర్శించిన ఎంపీఓ

సాక్షి ఎఫెక్ట్..



పాఠశాల గదుల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ యాదయ్య తదితరులు

యాలాల: మండలంలోని అక్కంపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం మండల పంచాయతీ అధికారి యాదయ్య సందర్శించారు. బుధవారం 'సాక్షి'లో 'పాముల కలకలం' అనే వార్త ప్రచురణకు అధికారులు స్పందించారు. పాఠశాలలో కొత్త భవనానికి ఆనుకొని ఉన్న పాత భవనం గోడల మధ్య ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అది విషపురుగులకు ఆవాసంగా మారినట్లు వారు గుర్తించారు. దీంతో పాటు వర్షపునీరు సైతం ఖాళీ స్థలం నుంచి గదిలోకి వస్తున్నట్లు తెలుసుకున్నారు. రెండు గదుల మధ్య ఖాళీ స్థలాన్ని కాంక్రీటుతో పూడ్చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మిని ఆయన ఆదేశించారు. అనంతరం పాఠశాల చుట్టూ పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని శుభ్రంచేయించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా

నేలకొరిగిన స్తంభాలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



పనులు చేపడుతున్న సిబ్బంది

తాండూరు రూరల్: 'బొంకూర్‌కు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా' అనే కథనాన్ని బుధవారం 'సాక్షి'లో ప్రచురించారు. దీనికి అధికారులు స్పందించారు. గురువారం విద్యుత్ శాఖ రూరల్ ఏఈ జానీ తన సిబ్బందితో కలిసి బిజ్వార్ గ్రామ శివారులోని ఓ పొలంలో నేలకొరిగిన స్తంభాలకు మరమ్మతులు చేయించారు. ఆ స్తంభాలకు సపోర్టుగా మరో స్తంభాన్ని ఏర్పాటు చేయించి బిజ్వార్ నుంచి బొంకూర్ గ్రామానికి త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా చేయించారు. విద్యుత్ సరఫరా చేయించిన ఏఈ జానీ, సిబ్బందికి బొంకూర్ గ్రామస్తులు అభినందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న జగనమ్మ

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జగనమ్మ

దోమ: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జగనమ్మ పేర్కొన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని పాలేపల్లి, బాస్‌పల్లి, దొంగఎన్కేపల్లి, గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను టీచర్లతో కలిసి నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పాలు, గుడ్లు, బాలమృతం తప్పనిసరిగా పంపిణీ చేయాలన్నారు. పిల్లల ఎత్తు, బరువు తీసుకొని, అవసరమైన వారికి వైద్యం అందించేందుకు తగిన సలహాలు, సూచనలు చేయాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు సంపూర్ణ భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనూశ, ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు నర్సింహులు, అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు మల్లమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తిరుపతి రెడ్డి

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి

దుద్యాల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గురువారం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఎంట్ల మల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు కొడంగంటి మాణిక్యప్ప, కోట్ల శ్రీశైలం గౌడ్, పెద్ద బోయిని నారాయణ, చాకలి మొగులయ్య, కరీం చెన్నప్ప, కొండ సైదప్ప, మద్దూర్ అనంతప్ప, పాలమూరు సైదప్ప తదితరులకు తిరుపతి రెడ్డి కాంగ్రెస్‌కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, హస్నాబాద్ గ్రామ అధ్యక్షుడు తూర్పు భీములు ఉన్నారు.

వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి




పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

ఫిజియో డాక్టర్ శ్రీకాంత్

యాలాల: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న ఫిజియో వైద్య శిబిరాన్ని ప్రత్యేక అవసరం కలిగిన పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఫిజియో డాక్టర్ శ్రీకాంత్ కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఫిజియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ..ఈ శిబిరానికి తీసుకొచ్చే పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వం ఏడాదికి రూ.5,500 ఎస్కార్టు అలవెన్సు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా నాయకుడు ప్రభాకర్‌చారి, ఐఈఆర్పీలు చంద్రకళ, షష్టీదేవి తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ పారకుండా చర్యలు



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

దుద్యాల్: కొడంగల్ మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి సెప్టిక్ ట్యాంక్ పారకుండా చర్యలు తీసుకోవాలని గురువారం గ్రామస్తులు ప్రిన్సిపాల్ రాఘవేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా గురుకుల పాఠశాల నుంచి మలమూత్రం రోడ్డుపై పారుతూ దుర్గంధం వెదజల్లుతుందని వాపోయారు. ఈ విషయం గురించి పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ప్రధాన కూడలి అక్కడే ఉండడంతో చుట్టుపక్కల తండా వాసులు, శివాలయానికి వెళ్లే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రిన్సిపాల్ దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో శివకుమార్, హన్మంతు, నవీన్‌చారి, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.